క్లుప్తంగా

వివాదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలి


మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి రహీమ్

మునగపాక: గ్రామ స్థాయిలో వివాదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని మండల ప్రత్యేకాధికారి రహీమ్ సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మండల స్థాయి అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చిన్న చిన్న వివాదాలకు పోలీస్ స్టేషన్ వరకు వెళ్లకుండా స్థానికంగా పరిష్కరించుకోవాలన్నారు. అవకాశం ఉన్నంతలో వివాదాలకు దూరంగా ఉండాలన్నారు. తహసీల్దార్ పి.సత్యనారాయణ, పలు శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వరినాట్ల పరిశీలన


వరి నాట్లను పరిశీలిస్తున్న డీఏవో మోహనరావు

పాయకరావుపేట: మండలంలోని పలు గ్రామాల్లో ముమ్మరంగా సాగుతున్న వరి నాట్లను జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు శనివారం పరిశీలించారు. నాట్లు మెలకువలు, ఎరువుల యాజమాన్యం, పంట నమోదు ప్రాముఖ్యత రైతులకు వివరించారు. పలు సలహాలు, సూచనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ ఉమాప్రసాద్, ఏవో ఆదినారాయణ, ఏఈవో నాగమణి, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిళ్ల పంపిణీ


విద్యార్థులకు వాటర్ బాటిళ్లు అందిస్తున్న సర్పంచ్ శరగడం భాగ్యలక్ష్మి, బాపునాయుడు

అచ్యుతాపురం రూరల్ : తిమ్మరాజుపేట పాఠశాల విద్యార్థులకు సర్పంచ్ శరగడం భాగ్యలక్ష్మి, బాపునాయుడు శనివారం స్టీల్ బాటిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలుష్య కారకమైన ప్లాస్టిక్‌ను నిషేధించాలన్నారు. ప్లాస్టిక్ బాటిల్లో నీరు తాగడం కారణంగా రోగాల బారిన పడే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మారిశెట్టి వెంకటప్పారావు, అంగన్‌వాడీ కార్యకర్త భారతి, ఆయా రూప, లక్ష్మి పాల్గొన్నారు.

అలరించిన సంకీర్తనలు


మునగపాకలో సంకీర్తనలు ఆలపిస్తున్న కళాకారులు

మునగపాక: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా లింగరాయి గుడిలో మునగపాకకు చెందిన అన్నమయ్య స్వర తరంగిణి కళాకారులు శనివారం రాత్రి ఆలపించిన సంకీర్తనలు అలరించాయి. సంకీర్తనలు ఆలకించేందుకు స్థానికులు తరలివచ్చారు.

మునగపాకలో వాహన తనిఖీలు

మునగపాక: ప్రతి ఒక్కరూ వాహన రికార్డులను అందుబాటులో ఉంచుకోవాలని ఎస్‌ఐ పి.ప్రసాదరావు కోరారు. మునగపాక మెయిన్‌రోడ్డులో శనివారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆటో డ్రైవర్లు కూడా పరిమితికి మించి ప్రయాణికులను తీసుకువెళితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

సంతోషిమాత హుండీ ఆదాయం రూ.2.58 లక్షలు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం సంతోషిమాత దేవాలయంలో హుండీ ఆదాయం రెండు లక్షలా 58 వేలా 518 రూపాయలు వచ్చినట్లు ఈవో బి.మురళీకృష్ణ, ఇన్‌స్పెక్టర్ వి.వసంతకుమార్, చైర్మన్ మారిశెట్టి భాస్కరరావు తెలిపారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో శనివారం ఇక్కడ హుండీ కానుకలు లెక్కించగా, నాలుగు మాసాలకు ఈ ఆదాయం వచ్చిందన్నారు. హుండీ ఆదాయం ఒక లక్షా 52 వేలా 048, భక్తుల టికెట్ల ద్వారా ఒక లక్షా 6 వేలా 470 రూపాయలు వచ్చినట్లు తెలిపారు. గతేడాది హుండీ, టికెట్ల రూపంలో లక్షా 30 వేలు రూపాయల ఆదాయం వచ్చిందన్నారు. శ్రావణ మాసం పురస్కరించుకుని ఆలయానికి వచ్చే భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పించడం వల్ల ఈ ఏడాది హుండీ ఆదాయం పెరిగిందన్నారు. ఈ నగదును దేవదాయ ధర్మదాయ శాఖ బ్యాంకు ఖాతాలో జమ చేశామన్నారు. ఆలయ అర్చకుడు కామేశ్వరరావు, గుమస్తా పీఎస్‌ఏ సత్యనారాయణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌కేలు, సహకార సంఘాల ద్వారా అరకొరగా సరఫరా

అదును దాటిపోతుండడంతో అన్నదాతల్లో ఆందోళన

ముందస్తు ప్రణాళికలు వేయని అధికారులు, పాలకులు

యూరియా.. ఏదయ్యా..?


మునగపాక పీఏసీఎస్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు(ఫైల్‌ఫొటో)

మునగపాక: యూరియా లభించక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలు(ఆర్‌ఎస్‌కే), సహకార సంఘాల ద్వారా యూరియాను అరకొరగా సరఫరా చేయడంతో ఈ పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. వారు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఓ వైపు యూరియా దొరక్కపోవడం.. మరో వైపు అదును దాటిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని 26 గ్రామాల పరిధిలో 3897 హెక్టార్ల మేర రైతులు పలు రకాల పంటల సాగు చేస్తున్నారు. ప్రధానంగా వరి, చెరకుతో పాటు ఇతర పంటల సాగుపై ఆసక్తి చూపుతుంటారు. అయితే వరి సాగుకు యూరియా ఆవశ్యకత ఉంది. యూరియా రైతులకు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నానో యూరియా మేలంటున్న అధికారులు

కొంత కాలంగా యూరియా కొరత ఎక్కువవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 646 మెట్రిక్ టన్నుల మేర యూరియా అవసరం కాగా ఇప్పటివరకు 443 **మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులోకి తీసుకువచ్చి పంపిణీ చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు వరిసాగుకు ఉపక్రమించే తరుణంలో యూరియా కొరత వేధిస్తుంది. దీంతో అధికారులు యూరియా వినియోగం తగ్గించి నానో యూరియాపై దృష్టి సారించాలంటూ చెప్పుకొస్తున్నా రైతులు తమకు యూరియా కావాల్సిందేనంటూ** కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. మోతాదుకు మించి యూరియా వినియోగించడం ప్రమాదకరమంటూ వ్యవసాయాధికారులు చెబుతున్నారు. మరోవైపు గడ్డి పెంపకానికి రైతులు యూరియాను ఎక్కువగా వినియోగిస్తున్నారని, యూరియా వేసిన గడ్డిని తిన్న పశువులు క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉంటుందంటూ రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.


మునగపాక పీఏసీఎస్ కార్యాలయం

వైఎస్ జగన్ హయాంలో పుష్కలంగా ఎరువులు

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఎరువులు పుష్కలంగా లభించేవి. రైతుభరోసా నిధులు, సకాలంలో సాగు నీరు అందించి రైతు పక్షపాతిగా ఆయన గుర్తింపు పొందారు. రైతుల విజ్ఞప్తి మేరకు ఎరువులు, విత్తనాలను ముందుగానే సిద్ధం చేసి సరఫరా చేసేవారు. నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యూరియా కోసం రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. డిమాండ్‌కు తగ్గ యూరియా అందుబాటులోకి తీసుకురావడంలో ప్రభుత్వం విఫలమైందంటూ రైతులు విమర్శలు గుప్పిస్తున్నారు.

యూరియా ఎప్పుడు వస్తుందో తెలియదు..



సీజన్‌లో రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో లేకుండా పోయింది. ముమ్మరంగా వ్యవసాయ పనులు జరుగుతున్నా యూరియా ఎప్పుడు వస్తుందో తెలియడం లేదు. సకాలంలో యూరియా రప్పించాల్సి ఉన్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. తక్షణమే యూరియాను అందుబాటులోకి వచ్చేలా చూడాలి.
– బొడ్డేడ చెల్లయ్యనాయుడు, రైతు, మూలపేట

ముందస్తు ప్రణాళికలు లేక అవస్థలు



ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ముందస్తు ప్రణాళికలు లేకపోవడంతో రైతులు యూరియా కోసం వేయికళ్లతో ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు అధికారుల దృష్టికి యూరియా సమస్య తీసుకెళ్లాం. సరైన చర్యలు చేపట్టకపోవడంతో రైతులు యూరియా కోసం అవస్థలు పడుతున్నారు.
– ఎస్.బ్రహ్మాజీ, సీపీఎం మండల కన్వీనర్

త్వరలో అందుబాటులోకి..

రెండు రోజుల్లోగా యూరియా అందుబాటులోకి వస్తుంది. రైతులు అవసరం లేకున్నా యూరియాను గడ్డి పెంపకం కోసం పట్టుకుపోవడంతో సమస్య వచ్చింది. ఇక్కడ పంటల సాగు కోసం ఎరువులను అందుబాటులోకి తీసుకువచ్చాం. యూరియా వినియోగం కూడా మోతాదుకు మించి ఉండకుండా చూడాలి. నానో యూరియాపై రైతులు దృష్టి సారించాలి.
– సుబ్రహ్మణ్యం, జిల్లా వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు, అనకాపల్లి

ఆచార్యులు మాస్టర్‌కు శిక్షారత్న పురస్కారం


శిక్షారత్న పురస్కారం అందుకుంటున్న ఆచార్యులు మాస్టర్

నక్కపల్లి: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, పెదబోదిగల్లం జెడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు ఎస్‌వీఎస్ ఆచార్యులకు శిక్షారత్న పురస్కారం లభించింది. శనివారం విశాఖపట్నంలో అంబేడ్కర్ భవన్‌లో జాతీయ మానవ హక్కులు, నేర నిరోధక విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి, మానవ హక్కులు నేరనిరోధక సంఘం చైర్మన్ బోడ రాజేష్ చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారం అందుకున్నారు. 79వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్క రించుకుని సమాజంలో నిస్వార్థంగా సేవలందిస్తున్న పలువురిని ఈ పురస్కారం కోసం ఎంపిక చేసినట్టు చైర్మన్ రాజేష్ తెలిపారు. ఆచార్యులు మాస్టర్ విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించడం, రాత్రిపూట ఇళ్లకు వెళ్లి పదో తరగతి విద్యార్థులకు సలహాలు, సూచనలు ఇవ్వడం, కరోనా సమయంలో సొంత ఖర్చులతో మాస్కుల పంపిణీ, తెలుగు భాష అభ్యున్నతికి, పద్య, గద్య రచనపై మక్కువ పెంచేందుకు విశేష కృషి చేశారు. ఈ పురస్కారం తన బాధ్యతను మరింత పెంచిందని, శక్తి మేరకు సేవా కార్యక్రమాలు చేస్తానని ఆచార్యులు చెప్పారు. శిక్షారత్న పురస్కారం అందుకున్న ఆచార్యులు మాస్టర్‌ను సహచర ఉపాధ్యాయులు, సిహెచ్.సత్యనారాయణ, కుమారి, ఫల్గుణరావు, తదితరులు అభినందించారు.

లక్ష్యంతో చదివితే ఉజ్వల భవిష్యత్


విజేతలకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ సతీష్‌కుమార్

మునగపాక: గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ప్రముఖ వైద్య నిపుణుడు పెతకంశెట్టి సతీష్‌కుమార్ అన్నారు. మండలంలోని వాడ్రాపల్లిలో జోగినాయుడు మాష్టారు గ్రంథాలయ వార్షికోత్సవాలు శుక్రవారం రాత్రితో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన పలు పోటీల విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జోగినాయుడు మాష్టారు గ్రంథాలయంలో విద్యార్థులకు అవసరమైన పలు రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఖాళీ సమయాన్ని వృథా చేయకుండా గ్రంథాలయాలకు వచ్చి చదువుకునేలా అలవాటు చేసుకోవాలన్నారు. ఇష్టపడి, కష్టపడి చదువుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. లక్ష్యం కోసం చదువుకుంటే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందన్నారు. గ్రంథాలయ గౌరవ అధ్యక్షుడు పెతకంశెట్టి రామజోగినాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, ఈఎన్‌టీ వైద్యుడు సాయి రామకృష్ణ, పెద్దలు బొడ్డేడ సత్యనారాయణ, మళ్ల వరహా నరసింగరావు, కొయిలాడ దశావతారం, మళ్ల రాజేష్, మళ్ల కన్నుంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకులను పరామర్శించిన కంబాల


తిరుమల్లేశ్వరరావును పరామర్శిస్తున్న కంబాల జోగులు


తూము రాజుబాబును పరామర్శిస్తున్న జోగులు, పార్టీ నాయకులు

పాయకరావుపేట: మండల పరిషత్ వైస్ ఎంపీపీ ధనిశెట్టి మాధవి భర్త, వైఎస్సార్‌సీపీ నాయకుడు ధనిశెట్టి తిరుమల్లేశ్వరరావును శనివారం ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు, రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రామారావు పరామర్శించారు. తిరుమల్లేశ్వరరావు ఇటీవల కాలుకు ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్దనే విశ్రాంతి పొందుతున్నారు. ఈ మేరకు ఆయన ఆరోగ్య విషయాలు తెలుసుకుని, ధైర్యం చెప్పారు.

➡ అరట్లకోట గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు తూము రాజుబాబును పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రామారావు పరామర్శించారు. తూము రాజుబాబు తల్లి అమ్మాజీ ఇటీవల మృతి చెందారు. రాజుబాబును, కుటుంబ సభ్యులను అరట్లకోటలోని స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల మాజీ అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దగ్గుపల్లి సాయిబాబా, ఉప సర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, మాసాహేబుపేట, గోపాలపట్నం, పెంటకోట సర్పంచ్‌లు గెద్దమూరి నీలవేణి శ్రీనివాసరావు, పన్నీరు బాబ్జి, చేపల నాగమణి తాతాజీ, పార్టీ పట్టణ అధ్యక్షుడు ధనిశెట్టి మహేష్, పడాల దివాణం, మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ పెనుమత్స నాగేశ్వరరావు, గ్రామ నాయకులు గర్లంక వెంకటసూరి, పేపకాయల అప్పారావు, పంచాయతీ వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణాలకు విరాళాల వెల్లువ


మోదకొండమ్మ తల్లి గుడికి విరాళం అందజేస్తున్న భక్తుడు శివ


వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి విరాళం అందిస్తున్న కాసేశ్వరరావు, గాయత్రి దంపతులు

మునగపాక: స్థానిక బైపాస్ రోడ్డులో తలపెట్టిన శ్రీమోదకొండమ్మ తల్లి గుడి, శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. పలువురు భక్తులు ఆలయాల నిర్మాణంలో భాగస్వాములవుతున్నారు. మునగపాకకు చెందిన మళ్ల శివ, కృష్ణవేణి దంపతులు మోదకొండమ్మ తల్లి గుడి నిర్మాణానికి రూ.10,116 నగదును శనివారం విరాళంగా అందజేశారు. వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి విశాఖపట్నంకు చెందిన పీలా కాసేశ్వరరావు, గాయత్రి దంపతులు రూ.25వేల నగదును విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, కమిటీ సభ్యులు కాండ్రేగుల జగ్గారావు, పెంటకోట ఉమేష్, కొయిలాడ దశావతారం, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన అవసరం


రోడ్డు భద్రతపై సూచనలు చేస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

ఎస్.రాయవరం: రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు అన్నారు. నక్కపల్లి సర్కిల్ పరిధిలో శనివారం అడ్డురోడ్డు జంక్షన్‌లో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవగాహన లేకపోవడం వల్ల చాలా మంది ప్రమాదాలకు గురవుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ విభీషణరావు, తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ అవసరం


మాట్లాడుతున్న ఎంఈవో-1 వేణుగోపాలరావు


మునగపాక: చదువులో వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించాలని ఎంఈవో-1 వేణుగోపాలరావు కోరారు. మండలంలోని గణపర్తి, మునగపాక జిల్లా పరిషత్ హైస్కూళ్లలో శనివారం నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడా రు. విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు కష్టపడి పనిచేయాలన్నారు. సీ,డీ గ్రేడుల విద్యార్థులపై శ్రద్ధ చూపాలన్నారు. విద్యార్థుల సంఖ్య పెంపునకు పాటుపడాలన్నారు. అభ్యసన నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు రోదామణి, శ్రీనివాసరావు, సీఆర్‌ఎంటీలు కర్రి లక్ష్మీనారాయణ, అచ్యుతకృష్ణ, సత్తిబాబు, ఎం.గోవింద, నూకేష్, తదితరులు పాల్గొన్నారు.

సీతారామరాజునగర్‌లో నేడు అన్నసమారాధన


సీతారామరాజునగర్‌లో బాల వినాయకుడు

కోటవురట్ల: మండల కేంద్రంలోని సీతారామరాజునగర్‌లోని శ్రీ బాల వినాయక యూత్ ఆధ్వర్యంలో ఆదివారం అన్నసమారాధన నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా మండపం వద్ద గణనాథునికి ఉదయం పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. భక్తులు స్వామి ప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు.

ధ్యాన వేంకటేశ్వరస్వామికి విశేష అలంకరణ



కశింకోట: స్థానిక ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారిని శనివారం వజ్ర కవచాలంకృతులతోపాటు వివిధ రకాల పూలు, తులసీమాలలతో అందంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. విష్ణు సహస్ర నామార్చన చేశారు. నక్షత్ర హారతి ఇచ్చారు. అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

డ్రోన్‌తో ఎరువుల పిచికారీపై అవగాహన


డ్రోన్‌తో ఎరువు పిచికారీ చేస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం: డ్రోన్‌తో ఎరువులు, పురుగు మందుల పిచికారీ చేస్తే సమయం, ఖర్చు తగ్గి పూర్తి స్థాయిలో పంటకు మేలు జరుగుతుందని మండల వ్యవసాయాధికారి సౌజన్య తెలిపారు. దార్లపూడి గ్రామంలో శనివారం డ్రోన్‌తో యూరియా పిచికారీ చేసే విధానంపై అవగాహన కల్పించారు. పెరుగుతున్న సాగు ఖర్చులు దృష్టిలో పెట్టుకుని అనుకూలంగా ఉన్న సదుపాయాలు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దార్లపూడి సర్పంచ్ సుభాషిని, వైఎస్సార్‌సీపీ నాయకులు పోలిశెట్టి పెద ఈశ్వరరావు, కోరెడ్డి బాబి, రంగనాథ్, తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరకు ఎరువులు విక్రయిస్తే చర్యలు


ఎరువుల దుకాణాల్లో రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ సుబ్రహ్మణ్యం, ఏవో రంగాచారి

అనకాపల్లి: ప్రైవేట్ దుకాణాల్లో అధిక ధరకు ఎరువులు విక్రయిస్తే వ్యవసాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు (ఏడీఏ) సీహెచ్ సుబ్రహ్మణ్యం తెలిపారు. పట్టణంలో గాంధీ కూరగాయల మార్కెట్, మెయిన్‌రోడ్డులో ఎరువుల దుకాణాల్లో శనివారం ఆయన తనిఖీలు నిర్వహించి మాట్లాడారు. వరి రైతులకు సకాలంలో ఎరువులు అందించే విధంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఎరువులను ఎమ్మార్పీకి మాత్రమే అమ్మాలన్నారు. ఎక్కడైనా ఎక్కువ ధరకు అమ్మకాలు జరిగినట్లు తమ దృష్టికి వచ్చినట్లయితే దుకాణాలు సీజ్ చేస్తామన్నారు. రైతులు కోరిన యూరియా మాత్రమే ఇవ్వాలన్నారు. మరో రకం ఇచ్చినట్లయితే దుకాణ యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి పి.రంగాచారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్సీ జన్మదిన వేడుక


విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కోటవురట్ల: మాజీ ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ కాకినాడ పార్లమెంట్ పరిశీలకుడు డి.వి.సూర్యనారాయణరాజు జన్మదిన వేడుకలను మండలంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు పలు గ్రామాలలో కేక్ కట్ చేసి సేవా కార్యక్రమాలు చేపట్టారు. పందూరు ఎంపీపీ స్కూల్‌లో వైఎస్సార్ సీపీ నాయకులు తేటకాల నారాయణరావు, కొమారు రమణ, చీకట్ల వెంకట్, యువకులు, పార్టీ నాయకులు విద్యార్థులకు దుస్తులు, స్వీట్లు పంపిణీ చేశారు. కోటవురట్ల యూత్ లీడర్ శెట్టి బాబ్జీ కేక్ కట్ చేసి వేడుక జరిపారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

కల్లుగీత కార్మికుల ఉపాధిని కాపాడండి


ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గీత కార్మికులు

నర్సీపట్నం : కల్లుగీత కార్మికుల ఉపాధిని కాపాడండి అంటూ కల్లుగీత కార్మికులు శనివారం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఆర్డీవో, ఎక్సైజ్ సీఐకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కల్లు గీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్ర దేవుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కల్లుగీత కార్మికులను ఆదుకుంటుందని ఆశించామన్నారు. మద్యం దుకాణాలను రాజకీయ నాయకులకు సంబంధించిన వారికి కేటాయించారన్నారు. గీత వృత్తికి నష్టం చేసేలా ఉన్న బెల్టుషాపులను నియంత్రించడం లేదన్నారు. గీత కార్మికుల కార్పొరేషన్‌కు తగిన నిధులు ఇవ్వడం లేదన్నారు. కేరళ వంటి రాష్ట్రాల్లో తాటికల్లు ఆధారిత ఆహార పదార్థాలు తయారీకి ప్రభుత్వం కార్పొరేషన్ పెట్టి ప్రోత్సహిస్తుందన్నారు. ఆ తరహాలో ఏపీలో ప్రవేశపెట్టాలన్నారు. లేకుంటే భవిష్యత్తులో కల్లుగీత కార్మికులతో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బి.నాగేశ్వరరావు, ఎన్.రాజుబాబు, లోవరాజు, రమణ, చిన్న, సత్యం పాల్గొన్నారు.

12 కిలోల గంజాయి పట్టివేత

ఇద్దరు నిందితుల అరెస్టు, మరొకరు పరారీ


పట్టుబడిన గంజాయితో ఎస్‌ఐ రమేష్, పోలీసులు

కోటవురట్ల: మండలంలోని జల్లూరు జంక్షన్‌లో శనివారం పోలీసులు చేపట్టిన వాహన తనిఖీల్లో 12 కిలోల గంజాయి పట్టుబడింది. ఎస్‌ఐ రమేష్ వివరాల ప్రకారం.. గంజాయి రవాణాపై విశ్వసనీయ సమాచారంతో ఎస్‌ఐ రమేష్, రెవెన్యూ, పోలీసు సిబ్బందితో కలిసి జల్లూరు జంక్షన్‌లో వాహన తనిఖీలు నిర్వహించారు. అదే సమయంలో స్కూటీపై వెళ్తున్న వ్యక్తులను ఆపి తనిఖీ చేయగా వారి వద్ద 12 కిలోల గంజాయి పట్టుబడింది. నిందితులు చింతరెడ్డి గణపతి, చింతరెడ్డి రుతుగా గుర్తించారు. మరో నిందితుడు సామిరెడ్డి సతీష్ అక్కడి నుంచి పరారయ్యాడు. గంజాయిని చింతపల్లి నుంచి విశాఖకు తరలిస్తున్నట్టు గుర్తించారు. స్కూటీని సీజ్ చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.